క్లుప్తంగా

అదనపు తరగతి గదుల ప్రారంభం నేడు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంఈఓలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక

కావలి (జలదంకి): కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి కే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా బెజవాడ రవికుమార్, అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గాదిరెడ్డి హరనాథ్, ట్రెజరర్‌గా టంగుటూరి సుబ్బరామశర్మను ఎన్నుకున్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక వైద్యశిబిరం నేడు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పోలుబోయిన రమేష్ బుధవారం తెలిపారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌తో పాటు ఆధార్, రేషన్‌కార్డులు, మూడు పాస్‌ఫొటోలు తీసుకురావాలని కోరారు.

నేటి నుంచి మిలాద్-ఉన్-నబీ వేడుకలు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలో ఉన్న సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఔలియా దర్గాలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక ప్రార్థనలు, మహమ్మద్ ప్రవక్త ఉపన్యాసాలు, అన్నదానం, శుక్రవారం ఖురాన్ పఠనం, ప్రవక్త పవిత్ర చిహ్నాల ప్రదర్శన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

దువ్వూరు సొసైటీ అధ్యక్షుడిగా హరికిషోర్‌రెడ్డి


హరికిషోర్‌రెడ్డి

సంగం: మండలంలోని దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా బండా హరికిషోర్‌రెడ్డి, డైరెక్టర్లుగా మార్లెళ్ల కృష్ణయ్య, జడపల్లి దయాకర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సొసైటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. చైర్మన్‌గా చల్లా వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా కోడూరు నాగిరెడ్డి, శ్రీనివాసులుతో సొసైటీ సీఈఓ మేకల రమణయ్య ప్రమాణస్వీకారం చేయించారు.

ఆలయాల్లో చోరీ

కలిగిరి: నాగసముద్రం పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపాళెం, అంబటివారిపాళెం గ్రామాల్లోని రామాలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. నాగిరెడ్డిపాళెంలోని రామాలయం తలుపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి అమ్మవారికి చెందిన 8 మంగళసూత్రాలు, హుండీని తెరిచి అందులోని నగదును చోరీ చేశారు.అనంతరం ఎదురుగా ఉన్న పోలిమేర గంగిరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టిలోనికి ప్రవేశించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. ప్రస్తుతం గంగిరెడ్డి కుటుంబం బెంగళూరులో ఉండడంతో ఇంట్లో చోరీ వివరాలు తెలియలేదు.అలాగే అంబటివారిపాళెం రామాలయం తాళాలను పగులగొట్టిలోనికి ప్రవేశించారు. హుండీని సమీపంలోని వాగు వద్దకు తీసుకెళ్లి పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు కలిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు క్లూస్ టీం బుధవారం రాత్రి ఆలయాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు.

ఉర్దూ పాఠశాలల తనిఖీ

దుత్తలూరు/వింజమూరు(ఉదయగిరి): ఉర్దూ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ శాతాన్ని పెంచాలని డీఐ షేక్ ఖాజామొహిద్దీన్ అన్నారు. దుత్తలూరు మండలం వెంకటంపేట, నందిపాడు, దుత్తలూరు, వింజమూరు పాతూరులోని ఉర్దూ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

హైవేలపై వెలగని దీపాలు



- అంధకారంలో కూడళ్లు
- బస్‌షెల్టర్లు, మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థ
- పట్టించుకోని హైవే అధికారులు

దుత్తలూరు: జాతీయ రహదారుల నిర్వహణ విషయంలో హైవే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూడళ్లు, ఫ్లైఓవర్లపై దీపాలు వెలగక చీకటి పడితే అంధకారం నెలకొంటున్నా.. మరుగుదొడ్లు, బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. టోల్‌చార్జీల రూపంలో భారీగా వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారు.

అంధకారంలో దుత్తలూరు సెంటర్

మండల కేంద్రమైన దుత్తలూరు మీదుగా 565, 167బీ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. గతంలో 565 జాతీయ రహదారిని నిర్మించారు. తాజాగా కావలి-సీతారామపురం 167బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దుత్తలూరు సెంటర్‌లో 565వ నంబర్ జాతీయరహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన, బ్రిడ్జి కింద ఇరువైపులా సర్వీసు రోడ్లలో ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. మే1న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా హైవేను ప్రారంభించినా ఇప్పటి వరకు దీపాలను వెలిగించలేదు. దీంతో దుత్తలూరు సెంటర్‌లో చీకటి పడితే అంధకారం నెలకొంటోంది. దుత్తలూరు సెంటర్ నిత్యం ప్రయాణికుల రద్దీగా ఉంటుంది. చీకటి పడితే దుత్తలూరు సెంటర్‌లో అంధకారం నెలకొంటుండడంతో మహిళా ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. మరోవైపు కొత్తగా ప్రయాణించే వాహనచోదకులు సరీసురోడ్లలోని స్పీడ్‌బ్రేకర్లను గమనించక రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే దుత్తలూరు సెంటర్‌లో నందిపాడు వెళ్లే మార్గంలో కూడలిని విస్తరించకపోవడంతో అటు ఇటుగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.


అంధకారంలో దుత్తలూరు సెంటర్

మరుగుదొడ్లు లేక అవస్థ

మండలంలో దుత్తలూరు, నందిపాడు, నర్రవాడ సెంటర్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుత్తలూరు సెంటర్‌లో ఉదయాన్నే బెంగళూరు, హైదరాబాద్ నుంచి వచ్చే ట్రావెల్స్ వాహనాల్లో మహిళ ప్రయాణికులు దిగుతుంటారు. మరుగుదొడ్లు లేని కారణంగా తీవ్ర అవస్థ పడుతున్నారు.

విశ్రాంత ప్రదేశంలోనూ సౌకర్యాలు కరువు

565వ జాతీయ రహదారిపై దుత్తలూరు సమీపంలోని పాములూరు రోడ్డులో విశ్రాంత ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ దీపాలు వెలగడం లేదు. మరుగుదొడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారులపై దీపాలు వెలిగించి బస్సుషెల్టర్లు, మరుగుదొడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు లేక..


బస్‌షెల్టర్ లేక హైవేపైనే ఎండకు నిరీక్షిస్తున్న ప్రయాణికులు

దుత్తలూరు సెంటర్‌లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దుత్తలూరు సెంటర్‌లో చెట్లు ఉండేవి. వాటి కింద ఎండ, వానలకు ప్రయాణికులు తలదాచుకునే వారు. హైవేల నిర్మాణంలో భాగంగా చెట్లను తొలగించడంతో హైవేపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. హైవేపై వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో పైకి వస్తుండడంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వేచి ఉండాల్సి వస్తోంది.

అలంకారప్రాయంగా సెంట్రల్‌లైటింగ్


జాతీయ రహదారిపై వెలగని సెంట్రల్ లైటింగ్

సీతారామపురం : స్థానిక ఎల్‌వీఆర్ కళాశాల సమీపంలో 167బీజీ జాతీయ రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మారింది. హైవేను ప్రారంభించి నెలలు గడుస్తున్నా సెంట్రల్‌లైటింగ్‌ను అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో రాత్రి వేళల్లో కూడలి ప్రాంతంలో అంధకారం అలుముకుంటోంది. హైవే కూడలి ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సెంట్రల్‌లైటింగ్‌ను ప్రారంభించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు


బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: మోసం, వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కుమ్మరకొండూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నోటి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. తొలుత ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ జనరంజక పాలన అందించి ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్లలో తండ్రిని మరిపించేలా పాలన కొనసాగించారన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. నాడు-నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు పాలనను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అందజేస్తామని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఏడాది పాలన పూర్తయినా హామీలను నెరవేర్చలేదన్నారు. బాబు మోసాలను ప్రజలకు వివరించి 2029 ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామకమిటీ సభ్యులను నియమించారు. ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలీ అహ్మద్, జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, కలిగిరి, జలదంకి, వరికుంటపాడు మండలాల పార్టీ అధ్యక్షులు కాటం రవీంద్రారెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తిరుపతినాయుడు, కేడీపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు కూనిపోగు ఇర్మియ, నోటి అనందరెడ్డి, బంకా ప్రసాద్, మాలకొండారెడ్డి, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి


రైతులతో మాట్లాడుతున్న మూలం రమేష్, మంగళ పుల్లయ్య

సంగం: జిల్లాలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యానికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు దువ్వూరులో పర్యటించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులను ఆరాతీశారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఎడగారులో ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడులు అయ్యాయని తెలిపారు. యూరియా కొరతతో బ్లాక్ మార్కెట్‌లో రూ.900 వరకు పెట్టి కొనుగోలు చేసి వేయాల్సి వచ్చిందని వివరించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు పుట్టి రూ.14వేల నుంచి రూ.15వేలకు కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. స్పందించిన సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎడగారులో 3.50లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని తెలిపారు. దాదాపు 12 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మిల్లర్లు, దళారులు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర రూ.22వేలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని సాధించాలి

ఉదయగిరి రూరల్: ఉపాధి సిబ్బంది పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని సాధించాలని ఏపీడీ మృదుల అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉదయగిరి క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద 790 హెక్టార్లలో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 560 హెక్టార్లలో పండ్లతోటల సాగుకు రైతులను గుర్తించడం జరిగిందన్నారు. ఉపాధి కింద పండ్ల తోటల సాగుకు మూడేళ్లకు మామిడికి రూ.లక్ష, బత్తాయి, నిమ్మకు రూ.1.50 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నర్సరీల్లో మంచి మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవగాహన కల్పించి సాగు వైపు ప్రోత్సహించాలన్నారు.

గణేశ్ నిమజ్జన కోలాహలం

సంగం: సంగం పెన్నా బ్యారేజ్ వద్ద మంగళవారం అర్ధరాత్రి గణేశ నిమజ్జన కోలాహలం నెలకొంది. మండలంలోని అన్నారెడ్డిపాళెం, సిద్ధీపురం, కొరిమెర్ల, మర్రిపాడు, సంగం, తదితర గ్రామాల్లోని వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులను తొమ్మిదిరోజు నిమజ్జనానికి తరలించారు. వినాయకుడి ప్రతిమలను ట్రాక్టర్లపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం సంగం బ్యారేజ్ వద్ద పెన్నా నదిలో నిమజ్జనం చేశారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను హౌసింగ్ ఏఈ శరత్‌చంద్ర బుధవారం పరిశీలించారు. గృహ లబ్ధిదారులతో సమావేశమై త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రూ.50వేల వరకు అదనంగా అందజేస్తోందని, సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ దాసరి రాజయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శోభన్‌బాబు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో కాకాణిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాకాణి ఆత్మకూరులో పార్టీ పరిస్థితులను విక్రమ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితను పార్టీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి రాష్ట్ర పదవి చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, మాముడూరు సుధాకర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ముజీబ్, చల్లా వెంకటేశ్వరరెడ్డి, బాలఅంకయ్య, నందవరం ప్రతాప్, జమ్రు, కే కిషోర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరు: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు కెనరా బ్యాంకు బ్రాంచ్ మేనేజరు సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని ఎస్వీడిగ్రీ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఆర్థిక ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఏపీజీబీ మేనేజర్ మోహన్‌రావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ రజత్‌మహాన్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీ ఆంజేయులు, మేనేజర్ వీ అశోక్‌కుమార్, ప్రాజెక్ట్ ట్రెయినర్ రాజేష్, విజయ్, ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

9,11తేదీల్లో అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు ఈ నెల 9,11 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ పుణ్యవతి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బెడుసుపల్లి, నర్రవాడ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి రెండు దరఖాస్తులు రాగా నిబంధనల మేరకు తగిన అర్హత లేకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. సహాయకుల పోస్టులకు సంబంధించి ఆంద్రావారిపల్లి-1, సీతారామపురం బెస్తకాలనీ-2, ఉదయగిరి ఎస్సీ-3, సీతారామపురం హెచ్‌డబ్ల్యూ-2, పడమటిరొంపిదొడ్ల-2, ఉదయగిరి సినిమాహాలు సెంటర్-2, పెద్దిరెడ్డిపల్లి మెయిన్-1, నెమళ్లదిన్నె-2, పోలంగారిపల్లి-1 చొప్పున దరఖాస్తులు అందాయని వివరించారు. గుండుపల్లి కేంద్రానికి వచ్చిన దరఖాస్తును తగిన అర్హత లేకపోవడంతో తిరస్కరించామన్నారు. 9వ తేదీ ఆత్మకూరు, 11వ తేదీ కందుకూరు ఆర్డీఓ కార్యాలయాల్లో ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

క్యాంపర్ ఢీకొని ఐదు గేదెలు మృతి


దెబ్బతిన్న వాహనం


మృతి చెందిన గేదెలను పరిశీలిస్తున్న స్థానికులు

దుత్తలూరు : దుత్తలూరు నుంచి ఉదయగిరి వైపు వెళ్తున్న మహీంద్ర క్యాంపర్ వాహనం బలంగా ఢీకొనడంతో ఐదు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన సోమలరేగడ ఎస్సీకాలనీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో క్యాంపర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. సోమలరేగడకు చెందిన జువ్వల దిన్నె శ్రీనివాసులుకు చెందిన మూడు గేదెలు, ఎస్సీ కాలనీకి చెందిన పిల్లా వరలక్ష్మి, చింతా వెంకటరమణమ్మకు చెందిన ఒక్కో గేదె మృతి చెందాయి. నూతలపాటి వెంకటస్వామికి చెందిన మరో గేదె కొన ఊపిరితో ఉంది. గేదెల విలువ సుమారు రూ.5లక్షలకుపైగా ఉంటుందని బాధితులు వాపోయారు. కుటుంబ జీవనాధారమైన గేదెలు మృత్యువాత పడడంతో బాధితులు లబోదిబోమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లార్వా సర్వే

వరికుంటపాడు: రామాపురం పంచాయతీలో హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లార్వా సర్వేను బుధవారం చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇళ్లలోని నిల్వ నీటిని తొలగించారు. నిల్వ నీటిలో దోమల నివారణ మందు చల్లారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

ఉదయగిరి రూరల్: మండలంలో స్వామిత్వ సర్వే 90 శాతం పూర్తయిందని ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. మండలంలోని గండిపాళెంలో స్వామిత్వ సర్వేను బుధవారం వారు పరిశీలించారు. ఈ నెల 15వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రభుత్వం స్వామిత్వ సర్వే ఆధారంగా ఆస్తుల యజమానులకు హక్కులను కల్పిస్తూ కార్డులను అందజేస్తుందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి ఏ.వెంకటరమణయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దగదర్తి: కృత్రిమ కొరత సృష్టించి యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు ఏ శ్రీహరిరావు, పీ వేణుగోపాలరావు హెచ్చరించారు. దగదర్తి, చెన్నూరులోని ఎరువుల దుకాణాలను బుధవారం వారు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, రైతులకు బిల్లులను ఖచ్చితంగా అందజేయాలని సూచించారు. వారి వెంట ఏఓ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

డీఆర్ చానల్‌పై అసత్య ఆరోపణలు సహించం

దగదర్తి: దగదర్తి-రాచర్లపాడు చానల్ పనులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడును మండల టీడీపీ నాయకులు హెచ్చరించారు. దగదర్తి సమీపంలోని డీఆర్ చానల్ వద్ద బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, నాయకులు జలదంకి శ్రీహరి, హరికిషోర్‌రెడ్డి, హనుమంతరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతున్నా కాంట్రాక్టర్ వేగవంతంగా పనులు చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ కమీషన్ ఇవ్వలేదనే కారణంతోనే మాలేపాటి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాలేపాటి కాలువ ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఆక్రమణ తొలగిస్తే రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని తెలిపారు. దగదర్తి-బుచ్చి రోడ్డు పనుల్లో భాగంగా నిర్మించిన బ్రిడ్జిని డీఆర్ చానల్ తూముగా చూపించి నాసిరకంగా పనులు జరుగుతున్నాయని విమర్శించడం సిగ్గుచేటన్నారు

సౌర పలకల ఏర్పాటుకు స్థల పరిశీలన

దగదర్తి: మండలంలో పీఎం కుసుమ్ పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పాదనకు సౌర పలకల ఏర్పాటుకు సేకరించిన స్థలాన్ని నెల్లూరు ఎస్‌ఈ వీ విజయన్ బుధవారం పరిశీలించారు. ఐతంపాడులో సర్వేనంబర్4లో సుమారు 30 ఎకరాలు, కాట్రాయపాడులో సర్వేనంబర్ 207, 48 లలో సుమారు పది ఎకరాలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఐతంపాడు, కాట్రాయపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సౌర విద్యుత్ ఉత్పాదనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆయన వెంట ఏఈ ఖాజా ఉన్నారు.